సాక్షి
నిర్మల్
శుక్రవారం । 20 । జనవరి । 2023



మెస్రం వంశీయుల పూజలు

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో మెస్రం వంశీయుల పూజలు కొనసాగుతున్నాయి. కేస్లాపూర్ సమీపంలోని మర్రిచెట్టు వద్ద వంశస్తులందరూ బస చేశారు. 10లో▸

ఉచిత శిక్షణ

నిర్మల్‌టౌన్: శ్రీనివాస్ టెక్నికల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మహిళలకు తొమ్మిది రోజులపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉషా కుట్టుమిషన్, బుక్స్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8688356089 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /17.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండగా అనిపిస్తుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

అందరి కళ్లలో వెలుగు



శిబిరానికి వచ్చిన వృద్ధులతో మంత్రి



మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

- కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- జిల్లాలో రెండో విడత 'కంటి వెలుగు' ప్రారంభం



కళ్లద్దాలు సరి చూసుకుంటున్న మంత్రి

నిర్మల్‌టౌన్/నిర్మల్‌చైన్‌గేట్: కంటి సమస్యలు పరిష్కరించి అందరి కళ్లలో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గొల్లపేట, ఖురాన్‌పేట్, బంగల్‌పేట్, ధ్యాగావాడలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిబిరాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగానే ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపా రు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత శాఖ ల ఏఎన్‌ఎం, ఆశవర్క ర్లు, అంగన్‌వాడీలు, సెక్రటరీలు తమ ప్రాంతాల్లో విస్తృతంగా ప్ర చారం నిర్వహించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒ క్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సీడీఎంఏ సత్యనారాయణ, కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డాక్టర్ ఉప్పు, కృష్ణంరాజు, కౌన్సిలర్లు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు

జిల్లా వివరాలు

మొత్తం కేంద్రాలు	32
మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కేంద్రాలు	8
మండలాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలు	24
తొలిరోజు పరీక్ష చేసుకున్నవారు	4,639
1 రకం కళ్లద్దాలు తీసుకున్న వారు	248
1.5 రకం కళ్లద్దాలు తీసుకున్న వారు	335
2 రకం కళ్లద్దాలు తీసుకున్న వారు	296
2.5 రకం కళ్లద్దాలు తీసుకున్న వారు	200
3 రకం కళ్లద్దాలు తీసుకున్న వారు	159
మొత్తంగా అద్దాలు తీసుకున్నవారు	1,238

'కంటి వెలుగు'తో చూపు సమస్యలు దూరం

మామడ(నిర్మల్): కంటి వెలుగు కార్యక్రమంతో కనుచూపు సమస్యలు దూరం అవుతాయని కంటివెలుగు జిల్లా ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. మండలంలోని తొటిగూడలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో స్రవంతి, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజేందర్, కంటివెలుగు జిల్లా అదికారి శ్రీనివాస్, వైద్యాధికారులు అరుణ్‌కుమార్, శ్రీకాంత్, తహసీల్దార్ అరిఫా, ఎంపీడీవో రమేశ్ పాల్గొన్నారు.

జ్ఞానేంద్రియాలలో కన్ను ముఖ్యమైనది

లక్ష్మణచాంద(నిర్మల్): జ్ఞానేంద్రియాలలో కన్ను ముఖ్యమైనదని మంత్రి ఐకే రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ, కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నా రు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబా బు, ఆర్డీవో స్రవంతి, జెడ్పీ సీఈవో సుధీర్ కు మార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, జిల్లా ఇమ్యునైజేషన్ అ ధికారి నయనారెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జె డ్పీటీసీ రాజేశ్వర్, తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మోహన్, సర్పంచ్ ముత్యంరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, వైద్యులు శ్రీకాంత్, ప్ర త్యూష, వైష్ణవి, శ్రీమంత్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా విద్యార్థులకు స్టైఫండ్

- ప్రతినెల కిట్‌లకు బదులు రూ.100
- విద్యార్థుల ఖాతాల్లో జమ
- ఏడు నెలల భత్యం ఒకేసారి



నిర్మల్ కేజీబీవీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు

నిర్మల్‌రూరల్: నిరుపేద విద్యార్థులు, అనాథ చిన్నారులకు విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కస్తూరిబా విద్యాలయాలు ఏర్పాటు చేసింది. ఇందులో చదువుతున్న విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, శానిటరీ కిట్లను అందిస్తోంది. కిట్‌లో సబ్బులు, కొబ్బరినూనె, కాస్మొటిక్, ఇతర వస్తువులు ఉండేవి. కానీ విద్యార్థుల రోజువారీ ఖర్చులను ఇప్పటి వరకూ తల్లిదండ్రులే భరించాల్సి వస్తోంది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఇకనుంచీ కేజీబీవీ విద్యార్థినులకు ప్రతీనెల స్టైఫండ్ ఇవ్వాలని నిర్ణయించింది. కానీ ఈ విద్యాసంవత్సరం నుంచి శానిటరీ కిట్ల సరఫరా ఆపేసింది. వీటికి బదులుగా విద్యార్థులకు నెలకు రూ.100 చొప్పున స్టైఫండ్ ఇవ్వనుంది. ఈ డబ్బులతోనే బాలికలు తమకు అవసరమయ్యే వస్తువులను కొనుక్కోవాల్సి ఉంటుంది. అందులో భాగంగానే ప్రతీ బాలిక బ్యాంకులో వ్యక్తిగత ఖాతా తెరవాలని ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో ఐదువేల మంది విద్యార్థులు

జిల్లాలో 18 కేజీబీవీలు ఉన్నాయి. అందులో 6 నుంచి 12వ తరగతి వరకు 5,079 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు కొనసాగుతున్నాయి. ఆయా విద్యాలయాల ఎస్‌వోలు ప్రత్యేకంగా బ్యాంకు, పోస్టాఫీస్ అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఖాతాలు తెరిపించారు. ఒక్కో విద్యార్థికి గతేడాది జూన్ నుంచి నెలకు రూ.వంద చొప్పున ఏడు నెలలకు కలిపి రూ.700ల చొప్పున ఖాతాల్లో జమచేయనున్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులు ఈ ప్రక్రియను ప్రారంభించారు. బాలికలకు ప్రతినెల పరిశుభ్రత కిట్లు అందించాల్సి ఉండగా వాటి స్థానంలో స్టైఫండ్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోజురోజుకూ నిత్యావసరాల ధరలు పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వం అందించే రూ.వంద భత్యం విద్యార్థులకు ఏమాత్రం సరిపోవని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నగదుతో పాటుగా కిట్లను కూడా అందించాలని కోరుతున్నారు.

జిల్లా వివరాలు

కేజీబీవీలు	18
విద్యార్థులు	5,079
ఒక్కో విద్యార్థికి వచ్చే స్టైఫండ్	రూ.100
జిల్లాకు రానున్న నిధులు	రూ.35.55లక్షలు

త్వరలోనే ఖాతాల్లోకి నగదు



కస్తూరిబా విద్యార్థినులకు ప్రతీనెల రూ.100 స్టైఫండ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచి కిట్లకు బదులుగా భత్యం అందజేస్తారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే విద్యార్థులందరితో బ్యాంకులో ఖాతాలు తెరిపించాం. మరో వారం రోజుల్లో డబ్బులు జమ అవుతాయి.

– శ్రీదేవి, కేజీబీవీ జిల్లా ప్రత్యేక అధికారి

'ముడుపులు' చెల్లించాలని కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్‌లో బైఠాయించిన బీజేపీ నాయకులు



బీజేపీ నాయకులను లాక్కెళ్తున్న పోలీసులు

నిర్మల్ చైన్‌గేట్: నిర్మల్ మున్సిపాలిటీలో ఇటీవల దొడ్డిదారిన నియామకాలు చేపట్టిన 44 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్ల నుంచి మంత్రి, మున్సిపల్ చైర్మన్ తీసుకున్న సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. కార్యాలయం గేటు దూకి బైఠాయించారు. మంత్రి, మున్సిపల్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమాయక నిరుద్యోగ యువత నుంచి తీసుకున్న ముడుపులు తిరిగి చెల్లించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అత్యంత అవినీతి మయమైన మునిసిపాలిటీ ఏదైనా ఉందంటే అది నిర్మల్ మున్సిపాలిటే అన్నారు. కార్యక్రమంలో పార్టీ పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ నాయిడి మురళీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, దళితమోర్చా అధ్యక్షుడు సాగర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు వెంకటేశ్, అనుముల శ్రవణ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు నారాయణ గౌడ్, ఏలేటి లింగారెడ్డి, కొండజి శ్రవణ్, కరిపే విలాస్, ప్రేమ్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

నిర్మల్‌టౌన్: ముందస్తు అనుమతి లేకుండా కలెక్టరేట్‌ను ముట్టడించిన పలువురు బీజేపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సై, కానిస్టేబుల్ నియామకపు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం వెంటనే స్పందించి హైకోర్టు తీర్పు ప్రకారం అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోర్డు నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారని, హైకోర్టు తీర్పు ప్రకారం మార్కులు కలిపి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. హైకోర్టు తీర్పు అమలు చేస్తే వేల మంది అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్, నియోజకవర్గ అధ్యక్షుడు చరణ్ మౌర్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు సయ్యద్ అర్షద్, సంపత్ కుమార్, నాయకులు నవీద్, అఖిల్, సాయి, సాహెల్, తాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందేనా?



ఇసుక మేటలు పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- కడెం ప్రాజెక్టు వరదలతో పంటచేలలో ఇసుక మేటలు
- కోతకు గురైన వ్యవసాయ భూములు
- ఆర్నెళ్లు గడిచినా అందని పరిహారం

కడెం(ఖానాపూర్): గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటచేలలో ఇసుక మేటలు వేశాయి. వ్యవసాయ భూములు కోతకు గురై ఆనవాళ్లు కోల్పోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. వ్యవసాయశాఖ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. ఆర్నెళ్లు గడిచినా ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. అంతేకాకుండా పరిహారం విషయమై అధికారులను సంప్రదిస్తే స్పందించకపోవడంతో అసరు పరిహారం అందుతుందా? లేదా? అనే అనుమానం కలుగుతుందని బాధిత రైతులు వాపోతున్నారు.

వేలాది ఎకరాల్లో నష్టం

కడెం, ఖానాపూర్ మండలాల్లో గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. భూములు కోతకు గురయ్యాయి. ఇసుక మేటలతో పంటచేలు సాగుకు పనికిరాకుండా పోయాయి. ఖానాపూర్ మండలంలో 2,160 ఎకరాలు నీట మునగగా 150 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. కడెం మండలంలో 400 ఎకరాల్లో ఇసుకమేటలు వేశాయి. 2 వేల ఎకరాల్లో వరి, 838 ఎకరాల్లో పత్తి, 200ల ఎకరాల్లో మొక్కజొన్న, 80 ఎకరాల్లో పసుపు పంటలు నీట మునిగినట్లు అధికారుల సర్వేలో వెల్లడించారు. బాధిత రైతులు భూములను సాగుకు యోగ్యంగా తయారు చేసుకునేందుకు భారీ మొత్తంలో ఖర్చు చేశారు. ఆర్థికంగా లేని నిరుపేద రైతులు పంటచేలను బీళ్లుగానే వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కడెం, ఖానాపూర్ మండలాల రైతులు కోరుతున్నారు.




ఈ చిత్రంలో వాగును తలపిస్తోంది కడెం మండలం పాండ్వపూర్ సమీపంలోని వ్యవసాయ భూమి. గతేడాది జూలైలో కురిసిన వర్షాలతో కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలకు వంతెనకు ఇరువైపులా వందలాది ఎకరాలు ఇలా కోతకు గురై నిరుపయోగంగా మారాయి. మరమ్మతులకు భారీగా వ్యయం కావడంతో నిరుపేద రైతులు భూములను అలాగే వదిలేశారు. ప్రభుత్వం భూములకు పరిహారం చెల్లించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

నివేదిక పంపించాం

గతేడాది కురిసిన భారీ వర్షాలు, వరదలతో వందలాది ఎకరాలు దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలోనే భూములు, పంటపొలాలు సర్వే నిర్వహించాం. పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం. – సంధ్యారాణి, ఏవో, కడెం


సాగుకు పనికి రాకుండా ఉంది



కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలతో వంతెన పక్కన రోడ్డు తెగిపోయి మా రెండెకరాల వ్యవసాయ భూమి కోతకు గురైంది. భూమి సాగుకు పనికిరాకుండ పోయింది. భూమి లెవల్ చేయించాలంటే లక్షల రూపాయాలు ఖర్చు అవుతుంది.

– హరీశ్, రైతు, పాండ్వపూర్, కడెం

ప్రభుత్వం ఆదుకోవాలి



గతేడాది కురిసిన వర్షాలకు వచ్చిన భారీ వరదలతో మా పంటపొలాలు కోతకు గురయ్యాయి. పంటచేలలో ఇసుక మేటలు వేశాయి. అధికారులు సర్వే నిర్వహించి నెలలు గడుస్తున్నా పరిహారం అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– మల్లేశ్, రైతు, ఖానాపూర్

న్యూస్‌రీల్

క్రీడలతో ఒత్తిడి తగ్గుతుంది



పోటీల్లో పాల్గొన్న కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు దోహదం చేస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ అన్నారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పలు క్రీడాపోటీలు నిర్వహించారు. కర్ణకుమార్ మాట్లాడుతూ నిర్మల్, భైంసా, ఖానాపూర్ కోర్టుల న్యాయవాదులు, సిబ్బంది, కోర్టు పోలీసులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నూనె గంగాధర్, న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, నరేందర్, రమణ, మహేందర్, సాయి, మధుకర్, అర్చన పాల్గొన్నారు.

పశు మిత్రలకు వేతనం నిర్ణయించాలి



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న పశు మిత్రలు

నిర్మల్‌చైన్‌గేట్: పశు వైద్యశాఖలో సేవలందిస్తున్న పశు మిత్రలకు ప్రభుత్వమే వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, పసుమిత్ర సంఘం జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏవోకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఎలాంటి వేతనం తీసుకోకుండా పశు వైద్యశాఖలో సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకుని ఆశ వర్కర్ల మాదిరి వేతనం నిర్ణయించాలన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బొమ్మెన సురేశ్, జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా లావణ్య, గంగామణి, నవనీత, ప్రధాన కార్యదర్శిగా గోల ఇంద్ర, సహాయ కార్యదర్శులుగా సవిత, పద్మ, ప్రగతి, కోశాధికారిగా డి.సరిత, సభ్యులుగా సుమలత, రజితను ఎన్నుకున్నారు.

యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న రమాదేవి

ఖానాపూర్: యువత క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకుని క్రీడల్లో రాణించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని మస్కాపూర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ నేతల జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రితీష్‌రాథోడ్, బుక్య జానుబాయి, రాజేశ్వర్‌రెడ్డి, వొడిసెల అర్జున్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, బుచ్చన్నయాదవ్, మల్లయ్య, రాజుయాదవ్, కోల రాము, సల్కం సాయి, శేఖర్, ప్రశాంత్, సురేశ్, గిరి, మహేందర్, ఆనంద్, రాము, శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, మోహన్, రాము, రవి, భూమన్న, స్వామి, శివ, వెంకటేశ్, రంజిత్, అఖిలేశ్, రాజు, సాయికృష్ణ, ప్రశాంత్, గంగన్న తదితరులు ఉన్నారు.

డీఏవో దిష్టిబొమ్మ దహనానికి యత్నం

- అడ్డుకున్న పోలీసులు



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

నిర్మల్‌చైన్‌గేట్: రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తుంటే దుకాణాల యాజమాన్యంతో కుమ్మక్కై చోద్యం చూస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు గమనించి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, ముత్తన్న, జిల్లా కమిటీ సభ్యులు సుంచుల నారాయణ, జాన్‌పాల్ పాల్గొన్నారు.

'వరల్డ్ విజన్' సేవలు అభినందనీయం



స్టడీ మెటీరియల్ అందిస్తున్న డీఈవో

లక్ష్మణచాంద(నిర్మల్): జిల్లాలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 300 మంది విద్యార్థులకు సంస్థ సమకూర్చిన ఐకాన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంఈవో మధుసూదన్, ప్రిన్సిపాల్ నవిత, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న పాల్గొన్నారు.

23న వైద్యుల నియామకాలకు ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు ఈ నెల 23న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో పిడియాట్రిక్ (1) పోస్ట్ కొరకు ఎంబీబీఎస్ లేదా డీసీహెచ్ లేదా ఎండి, సీమాంగ్ సెంటర్‌లో గైనకాలజీ (2) పోస్టులకు డీజీవో లేదా ఓబీజీ చేసిన వారు, బస్తీ దవాఖానాలో 3 వైద్యాధికారి పోస్టులకు ఎంబీబీఎస్ అర్హత కలిగిన అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను nirmal.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నిర్మల్‌టౌన్: విధులను సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సర్వీస్ నుంచి రిమూవల్ చేయాల్సి వస్తుందని ఎస్పీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన బాసర కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను బాసర జోన్ డీఐజీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రెండు ఆలయాల్లో చోరీ

నేరడిగొండ: మండలంలోని వాగ్ధారి గ్రామంలోని జగదాంబ, సేవాలాల్ ఆలయాల్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రతి రోజులాగే ఆలయాల్లో పూజలు ముగించుకుని రాత్రి తాళం వేశారు. గురువారం ఉదయం 5గంటలకు గ్రామస్తులు వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉంది. ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గాదేవిపై ఉన్న రెండు గ్రాముల బంగారు మంగళ సూత్రంతో పాటు హుండీలోని సుమారు రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్సు అప్పగింత



పర్సును అందిస్తున్న భూమన్న

నిర్మల్‌చైన్‌గేట్: బస్సులో దొరికిన పర్సును పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు బయలుదేరిన రాజధాని బస్సులో జిల్లా కేంద్రానికి చెందిన ఉద్గిర్ భూమన్నకు పర్సు దొరికింది. దులో రూ.9వేల నగదుతో పాటు ఏటీఎం కార్డులు ఉన్నాయి. వివరాలను పరిశీలించగా ఆర్మూర్ మండలం మామిడిపల్లికి చెందిన నదీమ్ మోహిద్దీన్‌కు చెందినట్లుగా గుర్తించాడు. పర్సును తీసుకుని నేరుగా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. వివరాలను పరిశీలించిన పోలీసులు నదీమ్ మోహిద్దీన్‌ను పిలిపించి పర్సు అందజేశారు. పర్సును ఇచ్చిన భూమన్నను పట్టణ పోలీసులు అభినందించారు.

సాగులో సాంకేతికతతో మేలు



డ్రోన్ సాయంతో మందు పిచికారీ

కడెం: సాగులో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో మేలు చేస్తుందని ఖానాపూర్ ఏడీఏ సుజాత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీడ్ ఫాంలో డ్రోన్ సహాయంతో పురుగు మందు పిచికారీని పరిశీలించారు. డ్రోన్‌తో కూలీల సమస్య తీరడంతో పాటు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి, ఏఈవోలు సురేష్, తిరుపతి ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న మాలేబోరిగాం గ్రామానికి చెందిన సిడాం రామ(18) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. రామ హైదరాబాద్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రమాదవశాత్తు కంటైనర్ బోల్తా

నేరడిగొండ: మండలంలోని లింగట్ల జాతీయ రహదారిపై కంటైనర్ గురువారం సాయంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ఆటో బోల్తా..

నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ జాతీయ రహదారిపై గురువారం ఆటో బోల్తాపడింది. బోథ్ మండలంలోని పిపల్‌ధరి నుంచి ఆటోలో నిర్మల్‌కి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటోబోల్తా ప డింది. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



మైసమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



డోలాతో వస్తున్న మహిళలు



అమ్మ దర్శనానికి..

నాగోబా దర్శనానికి అమ్మ

- నేటితో ముగియనున్న జంగుబాయి ఉత్సవాలు
- మొక్కులు తీర్చుకున్న 356 మేళాలు
- నెలరోజుల పాటు కొనసాగిన జాతర
- తెలంగాణ నుంచే అధిక భక్తులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్యదైవంగా భావించే జంగుబాయి ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న నాగోబా పూజ నేపథ్యంలో నేటి రాత్రి జంగుబాయి కేస్లాపూర్‌కు చేరుకోనుందని భక్తుల నమ్మకం. శుక్రవారం ఉత్సవాలు ముగింపు కావడంతో గురువారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 356 మేళాలు జంగుబాయిని దర్శించుకున్నాయి. 2లక్షల 53 వేలకు పైగా భక్తులు హాజరైనట్లు కమిటీ సభ్యులు కొడప జాకు, మరప బాజీరావు తెలిపారు.

ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



రావిచెట్టుకు పూజలు చేస్తూ..



నేడు దేవతల శుద్ధీకరణ

నేడు మధ్యాహ్నం 2గంటలకు సిద్దికస, దారికస, విజ్జకస, టొప్లకస ప్రాంతాల్లోని పవిత్ర నదుల్లో నుంచి గంగాజలాన్ని తీసుకొచ్చి దేవతా విగ్రహాలను శుద్ధిచేస్తారు. శనివారం కేస్లాపూర్‌లో ప్రారంభం కానున్న నాగోబా దేవతా ఉత్సవాలకు అమ్మవారు వెళ్లనుండడంతో అదే రోజు చివరిగా కటోడాలు ఖరారు చేశారు. దేవతల శుద్ధి కార్యక్రమంతో జంగుబాయి ఉత్సవాలు ముగుస్తాయి.

జువైనల్.. జస్టిస్!

- నాలుగు జిల్లాల్లో జువైనల్ కోర్టుల ప్రారంభం
- బాల నేరాల పరిష్కారం వేగవంతం
- వారానికోసారి విచారణ



మంచిర్యాల జిల్లా జువైనల్ కోర్టు ప్రారంభించిన న్యాయమూర్తి ఉపనిషధ్వని



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టు

మంచిర్యాలక్రైం: బాల నేరస్తులకు సంబంధించిన కేసుల విచారణ ఇప్పటి వరకూ ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే కొనసాగుతోంది. విచారణ వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో జువైనల్ కోర్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఏ జిల్లాకు సంబంధించిన కేసులను ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎదురుగా ఉన్న బాలసదన్ కార్యాలయంలో ఈ నెల 12న జువైనల్ కోర్టును ప్రారంభించారు. ఇన్‌చార్జి న్యాయమూర్తిగా జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషధ్వని, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సహినా సుల్తానా, సూపరింటిండెంట్‌గా మహ్మద్ షఫీ కొనసాగనున్నారు.

కక్షిదారులు, న్యాయవాదులకు ఊరట...

జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడంతో ఇటు కక్షిదారులు, అటు న్యాయవాదులకు ఊరట లభించింది. ఇదివరకు జిల్లాకు చెందిన బాల నేరస్తులకు సంబంధించిన కేసులన్నీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జువైనల్ కోర్టులో న్యాయవిచారణ జరిగేవి. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే 150 కిలోమీటర్ల దూరం 4 నుంచి 5గంటల వరకు ప్రయాణం చేయాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో అక్కడే ఉండాల్సి రావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. పైగా కోర్టు టైం అయిపోయే సరికి మంచిర్యాలకు వచ్చేందుకు బస్సులు లేకపోవడంతో కక్షిదారులు బస్టాండులోనే బస చేసిన సందర్భాలున్నాయి. ఎట్టకేలకూ జిల్లా కేంద్రంలో జువైనల్ కోర్టు ఏర్పాటుతో కక్షిదారులు, న్యాయవాదులకు సమయం, డబ్బులు ఆదా కానుంది. అంతేకాకుండా కేసుల విచారణ సైతం త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో బాల నేరస్తుల కేసులు

మంచిర్యాల :	70
ఆదిలాబాద్ :	74
ఆసిఫాబాద్ :	80
నిర్మల్ :	136

బాలనేరస్తుల నియంత్రణకు కృషి



బాల నేరస్తుల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. సోషల్ మీడియా, ఇంటర్‌నెట్ సెల్‌ఫోన్లు యువతను, మైనర్లను పెడదోవ పట్టిస్తున్నాయి. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఎవరితో మాట్లాడుతున్నారు. వారి స్నేహితుల వివరాలను సైతం తెలుసుకోవాలి. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో సరదాగా గడుపుతు వారితో కాలక్షేపం చేసినప్పుడు వారి మానసిక స్థితిని, వారి ప్రవర్తనలో మార్పును గమనించాలి.

– అఖిల్ మహాజన్, ఇన్‌చార్జి డీసీపీ, మంచిర్యాల

జువైనల్ కోర్టు ఏర్పాటు అభినందనీయం



జిల్లాలు ఏర్పడిన చాల కాలం తర్వాత జిల్లా జువైనల్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయం. దీంతో కక్షిదారులకు చాల మేలు జరుగుతోంది. సామాన్య మానవుడు ఆదిలాబాద్ వెళ్లాలంటే వారిని కొన్ని సందర్భాల్లో న్యాయవాదులే డబ్బులిచ్చి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఎంతో ప్రయసాలకు ఓర్చి వెళ్లిన కొన్ని సందర్భాల్లో "కోర్టు సమయానికి వెళ్లకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. తిప్పలు తప్పుతాయి.

– సహినా సుల్తానా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జువైనల్ కోర్టు, మంచిర్యాల

కేసులు త్వరగా పరిష్కారం అవుతాయి



జిల్లాలో జువైనల్ కోర్టు ఏర్పాటు కావడం అభినందనీయం. దీంతో బాల నేరస్తులకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కరించబడుతాయి. జిల్లాకు మహిళా కోర్టు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో 2004 నుంచి జిల్లా కేంద్రంలో కోర్టులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 42 సర్వే నంబర్‌లో 5ఎకరాల స్థలం కేటాయించడం జరిగింది. త్వరగా నిర్మించాలి.

– రవీందర్‌రావ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మంచిర్యాల

రూ.లక్ష విలువైన గంజాయి పట్టివేత

- వివరాలు వెల్లడించిన సీఐ రఘుపతి



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రఘుపతి

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్రలో గంజాయి విక్రయించేందుకు వెళ్తుండగా మావల, సీసీఎస్ పోలీసులు బుధవారం ఉమ్మడిగా దాడి చేసి దస్నాపూర్ సమీపంలో రూ.లక్ష విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలానికి చెందిన దుతిరాజ్ ప్రశాంత్ జల్సాలకు అలవాటుపడ్డాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాధించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. తన మిత్రులతో కలిసి ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు సరఫరా చేస్తున్నాడు. తనకు వరుసకు మామైనా మిలింద్ నిర్వతికి గంజాయి సరఫరాపై చెప్పాడు. ఈ నెల 14న ఇరువురు హైదరాబాద్ చేరుకొని ప్రశాంత్ తనకు ముందే పరిచయం ఉన్నా లక్ష్మణ్‌కు ఫోన్ చేశాడు. గంజాయి కావాలని తెలిపి ఇద్దరు కలిసి ఈలనె 15న భద్రాచలం చేరుకొని రాత్రి అక్కడే ఉన్నారు. లక్ష్మణ్ వీరిని సిలేరు దగ్గరకు రమ్మని చెప్పగా వారు మరుసాటి రోజు 16వ తేదీన సిలేరుకు వెళ్లారు. అతడు వీరికి గంజాయి నమూనాలు చూయించాడు. అది చూసిన ప్రశాంత్ రూ.10వేలు అడ్వాన్స్‌గా ఇచ్చి కిలోకు రూ.3వేల చొప్పున ఎనిమిది కిలోల గంజాయి కావాలని అడిగాడు. ఈ నెల 17న భద్రాచలం చేరుకుని లక్ష్మణ్ ప్రశాంత్‌కు ఫోన్ చేసి బస్టాండ్‌కు వెళ్లాలని, అక్కడ మాకు సంబంధించిన వ్యక్తి గంజాయి ప్యాకెట్లు ఇస్తాడని చెప్పారు. ప్రశాంత్, మిలింద్ ఇద్దరు బస్టాండుకు వెళ్లగా ఓ వ్యక్తి వచ్చి 8 కిలోల నాలుగు గంజాయి ప్యాకెట్లు ఇచ్చారు. దీంతో ప్రశాంత్ ఫోన్‌పే ద్వారా రూ.13వేలు పంపించాడు. 18వ తేదీన ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు దస్నాపూర్ సమీపంలో ఆటో కోసం వేచి ఉండగా పోలీసులు పట్టుకుని తనిఖీ చేసి గంజాయి, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నాం. ఈ సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్ ఉన్నారు.

గొంతునులిమి భార్యను హతమార్చిన భర్త

- నిందితుడి కోసం గాలింపు చర్యలు



సురేఖ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

భైంసారూరల్: కట్టుకున్నవాడే కాలయముడయ్యాడు. జీవితాంతం తోడుగా ఉండాల్సిన వాడే గొంతునులిమి హతమార్చాడు. ఈ సంఘటన భైంసా మండలం దేగాం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలుకా బాలాపూర్ గ్రామానికి చెందిన జలోజి కూతురు సురేఖ అలియాస్ జ్యోతి(28) పదేళ్ల క్రితం భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన రమేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఎనిమిదేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కూతురు ఉంది. రమేశ్ ఏ పని చేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడు. రోజు మద్యం తాగివచ్చి భార్యను వేధించేవాడు. సురేఖ బీడీ కంపెనీలో ప్యాకింగ్ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గురువారం భార్యతో గొడవపడిన రమేశ్ గొంతునులుమి హత్య చేశాడు. అనంతరం ఇంటికి తాళం వేసే క్రమంలో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు ప్రశ్నించారు. అంతలోపే అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు లోపలికి వెళ్లి చూడగా సురేఖ మృతి చెంది కనిపించింది. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి పిల్లలు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. తండ్రి జలోజి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



అదనపు గదులకు భూమిపూజ చేస్తున్న మంత్రి

లక్ష్మణచాంద(నిర్మల్): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి పథకంలో భాగంగా మంజూరైన రూ.89 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, బెంచీలువంటి 12 రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మోహన్, నాయకులు రమేశ్, క్రిష్టారెడ్డి, గణేశ్, ఈటెల శ్రీనివాస్, జహీరొద్దీన్, మల్లయ్య, బిట్లింగ్ నారాయణ పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు



కార్యదర్శికి చిత్రపటం అందిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డెప్యూటీ కార్యదర్శి శుక్‌లాల్ మీనాలు నాగోబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువలతో సన్మానించారు. నాగోబా ఆలయ చరిత్ర, జాతర నిర్వహన వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఇందులో మెస్రం నాగ్‌నాథ్, మెస్రం శేఖ్‌నాథ్ ఉన్నారు.

వెంటాడుతున్న నీటి సమస్య



బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న మహిళలు

ఇంద్రవెల్లి: మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులకు నీటి కష్టాలు తప్పడం లేదు. కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాలను అధికారులు విస్మరిస్తున్నా రు. గురువారం ఉదయం ట్యాంక్ నింపకపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. ఎడ్లకు ప్రత్యేక నీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో వాటి దాహం తీర్చడానికి మెస్రం వంశీయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాగోబా మహాపూజకు వచ్చిన మెస్రం వంశీయులకు ఇటు మర్రి చెట్టు వద్ద, అటు గోవడ్ వద్ద నీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మెస్రం వంశ పెద్దలు కోరుతున్నారు.

ప్రభుత్వాలు మొండి వైఖరి వీడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల మొండి వైఖరి వీడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 27నుంచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, సిర్ర దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాందేవ్, నాయకులు గంగయ్య, ఖాసీం, సాంబన్న, ఆశన్న, సురేశ్, ఉస్మాన్, మారుతి, చందు, పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు



రెండు లేగదూడలకు జన్మనిచ్చిన ఆవు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నల్ల ధనుంజయ్‌కి చెందిన ఆవు ఒకే ఈతలో రెండు లేగ దూడలకు గురువారం జన్మనిచ్చింది. సదరు రైతు వద్ద ఈ ఆవు 13సంవత్సరాలుగా వరుసగా ఒక ఈతలో ఒక దూడకు మాత్రమే జన్మనిచ్చేది. 14వ ఈతలో రెండు లేగదూడలు జన్మించడంతో గ్రామస్తులు వాటిని చూసేందుకు ఆసక్తి కనబర్చుతున్నారు.

బాసర ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 51 రోజుల హుండీలో రూ.53,24,420 నగదు, 102 గ్రాముల మిశ్రమ బంగారం, 4.060 కిలోల వెండి, 18 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన, స్టేట్‌బ్యాంక్ సిబ్బంది, ఎస్సై, వాగ్దేవి సొసైటీ సభ్యులు ఉన్నారు.